
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
బుధవారం 14 ఆగస్టు 2024



కోల్ రైల్‌కు సై




- ఓరుగల్లుకు రానున్న మూడు కొత్త రైల్వే మార్గాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేంద్ర రైల్వేశాఖ మంజూరు
- రైల్వే లైన్‌లతో పెరగనున్న రవాణా, కనెక్టివిటీ
- కాజీపేట - భూపాలపల్లి లైన్ ప్రస్తావన కరువు

7

ఇటీవల కేంద్ర రైల్వేశాఖ ప్రకటించిన కొత్త రైల్వే ప్రాజెక్టులు ఓరుగల్లుకు భారీ ప్రయోజనాన్ని చేకూర్చనున్నాయి. కోల్‌బెల్ట్ ప్రాంతమైన రామగుండం నుంచి భూపాలపల్లి, ములుగు మీదుగా మణుగూరు వరకు నిర్మించే రైల్వేలైన్ బొగ్గు సరఫరాతో పాటు పర్యాటక అభివృద్ధిలో కీలకం కానుంది. అలాగే డోర్నకల్ జంక్షన్ నుంచి మిర్యాలగూడ, గద్వాల వరకు వేర్వేరు రైల్వేలైన్లు ఇతర తూర్పు, దక్షిణ రైల్వేలైన్లతో కనెక్టివిటీని పెంచటంతో పాటు బొగ్గు, బియ్యం, గ్రానైట్ తదితర వాటిని సరఫరా చేసే విధంగా కొత్త రైల్వే కారిడార్ అభివృద్ధికి అడుగులు పడనున్నాయి. అయితే కాజీపేట రైల్వే డివిజన్‌తో పాటు కాజీపేట - భూపాలపల్లి రైల్వేలైన్‌పై కేంద్రం ప్రకటన చేయకపోవటంపై ఓరుగల్లువాసుల్లో కొంత అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్




1 రామగుండం - భూపాలపల్లి (వయా మణుగూరు)
దూరం : 207 కి.మీ.
నిధులు : రూ.4,100కోట్లు
ప్రయోజనం : బొగ్గు సరఫరాతో పాటు టూరిజం అభివృద్ధి

2 డోర్నకల్ - మిర్యాలగూడ (కోదాడ)
దూరం : 105 కి.మీ
నిధులు : రూ.2,100కోట్లు
ప్రయోజనం : సరుకుల రవాణాతో పాటు హైదరాబాద్ కనెక్టివిటీ

3 డోర్నకల్ - గద్వాల
దూరం : 296 కి.మీ నిధులు : రూ.5వేల కోట్లు
ప్రయోజనం : కొత్త ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ

4 అసన్‌సోల్ (పశ్చిమబెంగాల్) - వరంగల్
దూరం : 1,316 కి.మీ
నిధులు : రూ.7,382 కోట్లు
ప్రయోజనం : గిరిజన ప్రాంతాలు, బొగ్గు రవాణా

పోతన పర్యాటకానికి చుక్కెదురు


అక్షరభ్యాస కేంద్రం భవనం

- బమ్మెరలో ఆగిన అభివృద్ధి పనులు
- నిధులున్నా ఆరునెలలుగా జరగని వైనం
- చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- కొత్త కాంట్రాక్టర్ కోసం అన్వేషణ
- పనులు పూర్తి చేయాలంటున్న స్థానికులు

పాలకుర్తి, జూలై 13 : ఒక చేత్తో కలం.. మరో చేత్తో హలం పట్టి పొలం దున్ని సాహిత్యాన్ని సాగు చేసిన పాండిత్య సంపన్నుడు బమ్మెర పోతన. పోతన స్మారకార్థంగా చేపట్టిన పర్యాటక పనులు మధ్యలోనే అసంపూర్తిగా ఆగిపోయాయి. ప్రారంభంలో స్పీడుగా కొనసాగిన పనులు గత అసెంబ్లీ ఎన్నికల సమయం నుంచి ఇప్పటి వరకు జరుగకుండా నిలిచిపోయాయి. గత ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు టూరిజం ప్యాకేజీలో భాగంగా రూ. 7.50 కోట్లు కేటాయించింది. ఈ పనులకు 2018లో అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా బమ్మెరకు వచ్చి పనులకు శంకుస్థాపన చేశారు.. బమ్మెరకు చరిత్ర ఉండడంతో ప్రాధాన్యత రీత్యా పనులు చేస్తూ వచ్చారు. కాంట్రాక్టర్ చొరవ చూపి పనులు పూర్తయ్యేందుకు చర్యలు చేపట్టారు. అయితే బడ్జెట్ సరిపోక పోవడంతో పనులు చేయలేనని చేతులెత్తేశాడు. ప్రస్తుతం మరో రూ. 6.50 కోట్లు మంజూరు చేసినటప్పటికీ కాంట్రాక్టర్ ముందుకు రాపోవడంతో పనులు పూర్తి కావడం లేదు, అయితే అధికారులు మరో కొత్త కాంట్రాక్టర్ కోసం ప్రయత్నిస్తున్నారని తెలిసింది. పోతన స్మారక మందిరంలో భవనాలు దాదాపుగా పూర్తయ్యాయి. ఇప్పడు చేయాల్సిన పనులు చాలానే మిగిలిపోయాయి. ఈ నెల 12న స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌భాషా పోతన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

బమ్మెరలో పూర్తి చేయాల్సిన పనులు

వాటిలో పోతన సమాధి, పోతన మోట తోలిన బావి, అక్కమాంబ వాగు (కాల్వ), విద్యుత్, టైల్స్ పనులు, ప్లాస్టరింగ్ పనులు, గ్రీనరీ (గార్డెన్) ఓపెన్ థియేటర్ నిర్మాణం, పార్కింగ్, ఆర్చిగేట్లు, పోతన కాంస్య విగ్రహం (22) ఫీట్లు ఎత్తు) ఆర్ట్, క్రాఫ్ట్ భవనాలు పూర్తి చేయాల్సి ఉంది.

ఆరు నెలల నుంచి ఆగిన పనులు

కొత్త ప్రభుత్వం వచ్చినపప్పటి నుంచి పర్యాటక పనులు పూర్తి చేయకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా జరుగని అభివృద్ధి పనులు ఇటీవల కాలంలో మంజూరైయినప్పటికి పనుల్లో పురోగతి లేకపోవడం పనులు పర్యవేక్షణ లోపించడంతో విమర్శలకు దారి తీస్తోంది. పనులను పూర్తి చేయాల్సిందిగా స్థానికులు, సాహితీ వేత్తలు, మేధావులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు బాధ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.


పిల్లర్లకే ఆగిపోయిన పోతన స్మారక అభివృద్ధి పనులు

పాలకుర్తిలో కూడా ఇదే పరిస్థితి ..

బమ్మెరలోనే కాకుండా పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం అభివృద్ధికి అప్పటి ప్రభుత్వం రూ. 10. 50 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో. చేపట్టిన పనులు కూడా ఆగిపోయాయి. పాలకుర్తిలో శ్రీ సోమేశ్వరల క్ష్మీనర్సింహ స్వామి దేవాలయం రినవేషన్ పూర్తి అయిం ది. పాల్కూరికి సోమనాదుడి స్మారక చిహ్నం పనులు పూర్తి చేశారు. సోమేశ్వర కల్యాణ మండపం నిర్మాణం పనులు కొంత వరకు పూర్తియినప్పటికీ ఇంకా డైనింగ్ హాలు నిర్మాణం కోసం పిల్లర్లు వేసి స్లాబ్ పనులు పూర్తి చేశారు. దీని దీని నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తేనే పనులు పూర్తి చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే వల్మిడి దేవస్థానం అభివృద్ధికి రూ. 5 కోట్లుతో అభివృద్ధి పనులు పూర్తియ్యాయి.

త్వరలోనే పనులను పునః ప్రారంభిస్తాం
జీవన్‌కుమార్, డీఈ, ఆర్‌అండ్‌బీ పాలకుర్తి

త్వరలోనే కొత్త కాంట్రాక్టర్‌ను నియమించి బమ్మెరలో ఆగిపోయిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తాం. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సంబంధిత శాఖ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షాసమావేశం నిర్వహించారు. త్వరలోనే పనుల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకుంటాం.


అసంపూర్తిగా ఉన్న ఓపెన్ థియేటర్

రాష్ట్రం ఏర్పడ్డాకే గుర్తింపు : మామిండ్ల రమేష్‌రాజా, కవి, రచయిత, పాలకుర్తి



చారిత్రక ప్రాంతాన్ని అభివృద్ధి పరచాలినేది ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక. చెన్నూరు మొదటి ఎమ్మెల్యే వెంకటకృష్ణప్రసాద్ చెన్నూరు (పాలకుర్తి) తెలంగాణ సాయుధ పోరాట విరమణ జరిగాక ఈ ప్రాంతాన్ని చారిత్రక ప్రాంతంగా గుర్తించారు. పాల్కూరికి సోమనాదుడు, బమ్మెర పోతన జన్మ స్థలాల అభివృద్ధి జరగాలని ఈ ప్రాంతానికి రోడ్లు వేయించారు. బమ్మెర పోతన స్మారకార్థంగా మందిరాన్ని నిర్మించారు. ఆయన ఈ ప్రాంతం వ్యక్తి కాక పోయినప్పటికి ప్రజలతో మమ్మెకమ్మై అభివృద్ధి చేసి చూపించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక పాలకుర్తి, బమ్మెరను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్న పరిస్థితి. దానిని కొనసాగింపుగా ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి పరచాలి.



అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి
డాక్టర్ రాపోలు సత్యనారాయణ, కవి, రచయిత పాలకుర్తి

పోతన ఊరిలో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనులను ఆగిపోకుండా సకాలంలో పూర్తి చేయాలి. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఇటీవల బమ్మెరలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం మంచి పరిణామం. పర్యాటక పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ నేతలంతా సంపాదనలో పడి అభివృద్ధిని మరిచిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలకు జేబులు నింపుకునేందుకే సరిపోయిందని ఎద్దేవా చేశారు. రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి 10 ఏళ్ల అయినా మాఫీ చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఆగస్టు 15 లోగా రూ. 2 లక్షల రుణమాఫీ హామీని నిలబెట్టుకుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 32 కోట్ల రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి చేసి చూపించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వస్తున్నాయన్నారు. జనగామ పట్టణ అభివృద్ధి కోసం రూ. 10 కోట్లను మంజూరు చేయించానని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. పట్టణంలో పటిష్ట డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం కోసం అధికారులతో మాట్లాడానన్నారు. ఏడాదిలోగా జనగామ పట్టణంలో సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. చీటకోడూరు రిజర్వాయర్‌ను నింపడం ద్వారా తాగు, సాగు నీరు అందుతుందన్నారు. చీటకోడూరు రిజర్వాయర్‌ను నింపేందుకు అధికారులతో మాట్లాడానని అన్నారు. తాను జనగామలోనే ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు సర్వల నర్సింగరావు, నాయకులు గంగం నర్సింహారెడ్డి, బడికె ఇందిర, బనుక శివరాజ్‌యాదవ్, వంగాల కల్యాణి, నిమ్మతి మహేందర్‌రెడ్డి, మేడ శ్రీనివాస్, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, లింగాల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కుడా'లో కలపడంపై అభిప్రాయ సేకరణ

మెజారిటీ ప్రజల అభీష్టం మేరకే నిర్ణయం: ఎమ్మెల్యే పల్లా


అభిప్రాయ సేకరణ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జనగామ పట్టణంతో పాటు జనగామ మండలంలోని పలు గ్రామాలను కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా)లో కలపాలన్న అంశంపై మంగళవారం రాత్రి అభిప్రాయ సేకరణ జరిగింది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పలు రాజకీయ పార్టీలు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, న్యాయవాదులు, డాక్టర్లు, పలు సంఘాల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. సమావేశంలో భాగంగా బిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. 'కుడా'లో కలిస్తే అభివృద్ధి మరింత జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడగా మరికొందరు మాత్రం వ్యతిరేకించారు. కుడాలో విలీనం కావడం వల్ల జనగామ ప్రాంత అస్తిత్వానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. జనగామ అస్తిత్వాన్ని కాపాడుకునేలా అవసరమైతే 'జనగామ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ(జుడా)ను ఏర్పాటు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురా వాలని సూచించారు. 'కుడా'లో కలపడం వల్ల రిజిస్ట్రేషన్ విలువలు, ఇళ్ల నిర్మాణ అనుమతులకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని మరికొందరు వక్తలు అభిప్రాయపడ్డారు. సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలపై కూలంకశంగా చర్చలు జరిపిన తర్వాత మరోసారి సమావేశాన్ని నిర్వహించుకుందామని తీర్మానించారు.

మెజారిటీ ప్రజల అభిప్రాయం మేరకే నిర్ణయం: ఎమ్మెల్యే పల్లా

జనగామ ప్రాంత ప్రజల మెజారిటీ అభిప్రాయం మేరకే 'కుడా' పరిధిలో విలీనం కావడంపై నిర్ణయం ఉంటుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. 'కుడా' పరిధిని పెంచేలా వరంగల్ చుట్టుపక్కన ఉన్న నియోజకవర్గాలను కుడా పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. ఇందులో భాగంగా తమను కుడా పరిధిలోకి కలపాలంటూ మిగతా నియోజకవర్గాల ఎమ్మెల్యే అంగీకరిం చారన్నారు. ఈ క్రమంలో జనగామలోని వివిధ పార్టీల నేతలు, న్యాయవాదులు, వైద్యులు, వ్యాపారస్థులు, ప్రజా సంఘాల అభిప్రాయం మేరకు సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. సమావేశంలో అంశాలపై అధ్యయనం చేసిన తర్వాత మరోసారి సమావే శాన్ని నిర్వహిస్తామన్నారు.

జనగామ పట్టణ బంద్ విజయవంతం

జనగామ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దాడిని నిరసిస్తూ హిందూ సంఘాలు చేపట్టిన జనగామ పట్టణ బంద్ మంగళవారం విజయవంతమైంది. హిందూ సంఘాల విజ్ఞప్తి మేరకు మంగళవారం పట్టణంలోని అన్ని వ్యాపార, వాణిజ్య సముదాయాలు స్వచ్ఛందంగా బంద్‌కు పాటించాయి. బంద్ నేపథ్యంలో హిందూ సంఘాల నాయకులు పట్టణమంతా తిరుగుతూ దుకాణాలు మూసివేసి బంద్‌కు సహకరించాలని వ్యాపారస్తులను కోరారు. అనంతరం రైల్వే స్టేషన్ నుంచి జనగామ ఆర్టీసీ చౌరస్తా వరకు హిందూసంఘాలు ర్యాలీ నిర్వహించాయి.

విద్యార్థి దశలో ఎంతో విలువైంది

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్


మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో సమయం ఎంతో విలువైందని ప్రతీ నిమిషాన్ని విలువైనదిగా పరిగణించి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ జూనియర్ కళాశాల, మైనార్టీ రెసిడెన్షియల్, మహాత్మా జ్యోతిబాఫూలే రెసిడెన్షియల్ పాఠశాలలను మంగళవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థి దశలో సమయాన్ని వృధా చేయకుండా నిరంతరం విద్యపై దృష్టి సారించి నూటికి నూరుశాతం ఉత్తీర్ణతను సాధించేందుకు పాటుపడాలన్నారు. విద్యార్థులకు పాఠశాలలో ఏమైనా ఇబ్బందులున్నాయా అని అడిగితెల్సుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పాఠశాలల పరిసరాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం రుచి శుచితో కూడిన భోజనాన్ని అందించాలన్నారు. వంటశాలలను నిశితంగా పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు.

చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి వాళ్లలో పఠనాసక్తిని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమాధికారి రవీందర్, కళాశాల ప్రిన్సిపాల్ అనిల్‌బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి పాల్గొన్నారు.

మెనూ లేదు.. రికార్డుల నిర్వహణ లేదు

- రిజిస్టర్‌కు, క్షేత్రస్థాయిలో విద్యార్థుల సంఖ్యలో తేడా
- ఏసీబీ అధికారుల తనిఖీల్లో బట్టబయలు
- జనగామ ఎస్సీ బాలికల వసతి గృహంలో విస్తృత తనిఖీలు

జనగామ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల 'సంక్షేమం' పట్ల ఎస్సీ సంక్షేమ శాఖకు పట్టింపు కరువైంది. విద్యార్థులకు అందించాల్సిన ఆహారం విషయంలోనూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు, మెనూ ప్రకారం భోజనం, రికార్డుల నిర్వహణ లేకపోవడం వంటి అంశాలు అవినీతి నిరోధక శాఖ అధికారుల తనిఖీల్లో బట్టబయలు అయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏసీబీ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో జనగామ జిల్లాకేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల(ప్రీ, పోస్ట్‌మెట్రిక్) వసతి గృహంలో మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం 8 గంటలకే తనిఖీలు ప్రారంభించారు. ఏసీబీతో పాటు ఫుడ్ సేఫ్టీ, తూనికలు, కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా హాస్టల్‌లో పారిశుధ్య నిర్వహణ, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత,తో పాటు పలు రికార్డులను పరిశీలించారు. హాస్టల్‌లో బాత్‌రూమ్‌లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్నారా లేదా అని పరిశీలన జరిపారు. రికార్డుల నిర్వహణ, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులు నిర్వహించకపోవడానిక గల కారణాలను వసతి గృహ వార్డెన్ కవితను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో భాగంగా విద్యార్థుల సంక్షేమం పట్ల ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు బయటపడింది. హాజరు రిజిస్టర్‌లో ఉన్న విద్యార్థుల సంఖ్యకు, అధికారుల తనిఖీల సందర్భంగా క్షేత్రస్థాయిలో ఉన్న విద్యార్థుల సంఖ్యకు తేడాను అధికారులు గుర్తించారు. రిజిస్టర్‌లో మొత్తంగా 110 మంది విద్యార్థులు ఉండగా సోమవారం రాత్రి 71 మంది ఉన్నట్లు చూపించగా తనిఖీల సమయంలో 60 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. అదే విధంగా రోజూవారీగా విద్యార్థులు పెట్టాల్సిన మెనూను కూడా పాటించడం లేదని అధికారులు తేల్చారు. మెనూ పాటించడం లేదంటూ తనిఖీకి వచ్చిన అధికారులకు విద్యార్థులు ఫిర్యాదు చేశారు. హాస్టల్‌కు వచ్చే బియ్యం, పప్పులు, గుడ్లు, చింతపండు తదితర వస్తువులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్‌ను కూడా మెయింటెన్ చేయడం లేదని అధికారులు గుర్తించారు. వసతి గృహ వార్డెన్ రాత్రి పూట విధులకు హాజరు కావడం లేదని అధికారులు గుర్తించారు. తనిఖీలలో ఫుడ్ సేఫ్టీ అధికారి రోహిత్, ఆడిట్ అధికారి నాగరాజు, తూనికలు, కొలతల శాఖ అధికారి ప్రవీణ్‌కుమార్, ఏసీబీ సీఐలు సట్ల రాజు, ఎల్.రాజు, ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.


జనగామ ఎస్సీ హాస్టల్‌లో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

ఉన్నతాధికారులకు నివేదిక: ఏసీబీ డీఎస్పీ సాంబయ్య

ఎస్సీ బాలికల హాస్టల్‌లో తనిఖీకి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. తనిఖీల అనంతరం విలేఖరులతో ఆయన మాట్లాడారు. ఏసీబీ డీజీ ఆదేశాలతో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టామన్నారు. హాస్టల్‌లో పారిశుధ్య నిర్వహణ, ఆహార నాణ్యత, తదితర అంశాలను పరిశీలించి పలు లోపాలను గుర్తించామన్నారు. రిజిస్టర్‌లో, క్షేత్రస్థాయిలో విద్యార్థుల సంఖ్యకు పొంతన లేదని తెలిపారు. రోజూ మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని గుర్తించామని, దీనిపై విద్యార్థులు కూడా తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. హాస్టల్‌కు వచ్చే సరుకులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్ కూడా మెయింటెన్ చేయడం లేదన్నారు. విద్యార్థులకు రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్ రికార్డు మెయింటెన్ చేయాలని, అది కూడా జరగడం లేదని గుర్తించామన్నారు.

భేష్ బిట్టు!

పోలీసు జాగిలానికి ఘనంగా ఉద్యోగ విరమణ

సేవలను కొనియాడిన సీపీ



వరంగల్ క్రైం, ఆగస్టు 13: 11 ఏళ్ల పాటు పోలీసు విభాగంలో సేవలందించిన బిట్టు (పోలీస్ జాగిలం)కు ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంగళవారం హనుమకొండలోని పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బిట్టును సీపీ అంబర్ కిషోర్ ఝా ఘనంగా సత్కరించి చేసిన సేవలను కొనియాడారు. 2013 డిసెంబర్ 26న కమిషనరేట్ జాగిలాల విభాగంలో చేరి బిట్టు పోలీస్‌శాఖకు సేవలందించింది. ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులతో పాటు ఇతర వీవీపీలు కమిషనరేట్ పరిధిలో పర్యటించినప్పుడు పేలుడు పదార్థాలు గుర్తించడంలో బిట్టు కీలకపాత్ర పోషించింది. బిట్టుకు హ్యాంగ్లర్‌గా కానిస్టేబుల్ ప్రభాకర్ వ్యవహరించాడు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసుశాఖలో జాగిలం పాత్ర కీలకమన్నారు. పేలుడు పదార్థాలను గుర్తించడంతో పాటు మత్తు పదార్థాలు గుర్తించడంలోనూ జాగిలాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు శ్రీనివాస్, స్పర్జన్‌రాజ్, శ్రీధర్, చంద్రశేఖర్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్‌కుమార్, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు అతిథిగా మంత్రి సురేఖ

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 13: హనుమకొండలోని పోలీస్ పరేడ్‌గ్రౌండులో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను మంత్రి చేతులమీదుగా అందజేస్తారు.

కోల్ రైల్‌కు సై!

ఓరుగల్లుకు రానున్న మూడు కొత్త రైల్వే మార్గాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కోల్‌రైల్‌కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 1998 నుంచి భూపాలపల్లి కోల్‌బెల్ట్‌కు రైల్వే లైన్ నిర్మాణం చేయాలనే డిమాండ్ ఉంది. ఎట్టకేలకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ కోల్‌రైల్‌పై ప్రకటన చేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి భూపాలపల్లి, రామప్ప, మేడారం మీదుగా మణుగూరు వరకు 207కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మిస్తున్నట్లుగా పేర్కొన్నారు. దీనికోసం డీపీఆర్‌లు సిద్ధం చేశారు. అటవీ శాఖ నుంచి పూర్తి స్థాయిలో అనుమతులు లేకపోవటం కొంత జాప్యం జరుగుతోంది. అయితే రెండు మూడు నెలల్లో తుది అనుమతులు మంజూరు కానున్నాయని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.

రామగుండం నుంచి మణుగూరు వరకు 207కి.మీ.ల రైల్వేలైన్ కోసం సుమారు రూ.4,100 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2013-14లో రామగుండం - మణుగూరు రైల్వేలైన్ నిర్మాణం కోసం సర్వే చేయగా, 207కిలోమీటర్ల రైల్వేలైన్‌కు రూ.1,112కోట్లతో ఈ రైల్వే లైన్ నిర్మించవచ్చునని ప్రతిపాదన చేశారు. పదేళ్లలో ఈ అంచనా వ్యయం నాలుగు రేట్లు పెరిగింది. ఇక ఈ లైన్ పూర్తి అయితే భూపాలపల్లికి రైల్ కనెక్టివిటీ ఏర్పడుతుంది. దీంతో బొగ్గు దిగుమతి, ఎగుమతికి కష్టాలు తప్పనున్నాయి. అలాగే రామగుడం నుంచి భూ పాలపల్లి మీదుగా మణుగూరు వరకు రైల్వేలైన్ నిర్మాణంతో థర్మల్ పవర్ ప్రాజెక్టులకు బొగ్గు సరఫరా సులభం కానుంది. ప్రస్తుతం భూపాల పల్లిలోని కేటీపీపీకి బొగ్గును రామగుండం నుం చి రైల్ ద్వారా హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వేస్టేషన్‌కు దిగుమతి చేసుకుంటున్నారు. ఉప్పల్ నుంచి 70కిలో మీటర్లు ప్రయాణించిన పరకాల మీదుగా కేటీపీపీకి బొగ్గును సరఫరా చేస్తున్నారు. దీంతో అధిక వ్యయంతో పాటు సమయానికి బొగ్గు కేటీపీపీకి చేరటం లేదు.

అలాగే ఈ రైల్వేలైన్ ఏరియాలోనే రామగుండం సమీపంలోని 2,600 మెగావాట్ల ఎన్‌టీపీసీ విద్యుత్ కేంద్రంతో పాటు 1,600 మెగావాట్ల తెలంగాణ ఎన్‌టీపీసీ ప్రాజెక్టు, అలాగే జైపూర్‌లోని జెన్‌కోకు చెందిన 6,200మెగావాట్లు, 11 మెగావాట్లు విద్యుత్ కేంద్రాలు భూపాలపల్లిలో ఉన్నాయి. మణుగూరు సమీపంలోని 1,200 మెగావాట్ల భద్రాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుకు కూడా రైల్‌మార్గం అందుబాటులో లేదు. ఈ లైన్‌తో బొగ్గు సరఫరా ఈ పరిశ్రమలకు సులభతరం కానుంది. అలాగే కొత్త రైల్వేలైన్‌తో పర్యాటక రంగానికి పండుగ కానుంది. రామగుడం నుంచి మణుగూరు వరకు అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. వీటన్నింటినీ లింకు చేసుకుంటూ లైన్ నిర్మాణం చేయనున్నారు. ప్రధానంగా మంథని, కాళేశ్వరం, రామప్ప, మేడారం, లక్నవరం, ఏటూరునాగారం అభయారణ్యం, బొగత, మల్లూరు తదితర పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు సమీపం నుంచి మణుగూరు వరకు రైల్వేలైన్ నిర్మాణం సాగనుంది. దీంతో ఈ రైల్వేలైన్‌తో పర్యాటకానికి కొత్త కళ రానుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

డోర్నకల్ టు మిర్యాలగూడ, గద్వాల

రైల్వేశాఖ ప్రకటించిన కొత్త ప్రాజెక్టుల్లో కీలకమైనది మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్ నుంచి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వరకు 105కి.మీ రైల్వే లైన్. ఈ ప్రాజెక్టు కోసం రైల్వేశాఖ రూ.2,100కోట్ల అంచనాలతో డీపీఆర్ తయారు చేశారు. డోర్నకల్ నుంచి మహబూబాబాద్, ఖమ్మం జిల్లా ముదిగొండ, రాజేశ్వరపురం, నేలకొండపల్లి, కోదాడ మీదుగా మిర్యాలగూడ చేరుతుంది. ఈ లైన్‌తో హైదరాబాద్, విజయవాడ, చెన్నై, న్యూఢిల్లీకి అనుసంధానమవుతుంది. దీంతో యాదాద్రి పవర్ ప్లాంట్ వరకు భూపాలపల్లి నుంచి బొగ్గును, మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం నుంచి ధాన్యం, బియ్యం, గ్రానైట్ పరిశ్రమలకు, సిమెంట్ పరిశ్రమలకు సరుకులను రవాణా, షుగర్ ఫ్యాక్టరీల నుంచి చెక్కర సరఫరా చేసేందుకు మార్గం సుగమమవుతుంది.

అలాగే డోర్నకల్ నుంచి గద్వాల వరకు 296కిలో మీటర్ల రైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ లైన్ కోసం రూ.5వేల కోట్లతో అంచనాలను రూపొందించింది. ఈ లైన్‌తో వరంగల్ మీదుగా హైదరాబాద్, విజయవాడ సాగే లైన్‌తో మహబూబ్‌నగర్ మీదుగా హైదరాబాద్, బెంగూళూరు లైన్‌ను అనుసంధానం చేస్తున్నారు. కీలకమైన రెండు మార్గాలను అనుసంధానంతో పాటు కొత్తగా రైల్వేలైన్ లేని ప్రాంతాలకు కూడా రైల్వే కనెక్టివిటీ జరుగుతుంది. ఉత్తర, దక్షిణ ప్రాంతాలను కలిపే ఈ లైన్‌తో డోర్నకల్ జంక్షన్ మరింత కీలకంగా మారనుంది. వీటితో పాటు పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి వరంగల్ వరకు 1,316కిలో మీటర్ల రైల్వే కనెక్టివిటీకి కేంద్ర రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. ఈప్రాజెక్టుకు సుమారు రూ.7,382కోట్లు ఖర్చు చేస్తుంది. భద్రాచలం వద్ద నిర్మించే కొత్త స్టేషన్‌తో వరంగల్ రైల్వేలైన్‌కు అనుసంధానం అవుతుంది. గిరిజనుల అధికంగా ఉండే ప్రాంతాల గుండా ఈ రైల్వేలైన్ ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా బొగ్గు సరఫరాతో పాటు ప్రకృతి వైపరిత్యాల సందర్భాల్లో ప్రత్యామ్నాయం లైన్‌గా ఇది పని చేస్తుందని రైల్వేశాఖ భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆరు ప్రాజెక్టుల్లో నాలుగు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రయోజనం చేకూర్చేవే కావటం విశేషం.

అటకెక్కిన కాజీపేట - భూపాలపల్లి లైన్

కాజీపేట-భూపాలపల్లి మధ్య రైల్వేలైన్‌కు 2023-24 బడ్జెట్‌లో కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) కోసం రైల్వే శాఖ రూ.1,152కోట్ల నిధులు మంజూరు చేసింది. కాజీపేట నుంచి హసన్‌పర్తి లైన్ మీదుగా కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వే స్టేషన్ నుంచి రెండు కిలో మీటర్ల దూరంలోని మర్రిపల్లి గ్రామం వద్ద సైడ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. మర్రిపల్లి ట్రాక్ నుంచి చిట్యాల మండలం జడలపేట మీదుగా భూపాలపల్లి వరకు ఈ లైన్ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అయితే 2023-24లో నిధులు కేటాయించినప్పటికీ పనులు ముందుకు సాగలేదు. దీంతో 2024-25 బడ్జెట్‌లో కాజీపేట- భూపాలపల్లి రైల్వేలైన్‌కు గ్రీన్‌సిగ్నల్ రాలేదనే విమర్శలున్నాయి. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కాజీపేట-భూపాలపల్లి లైన్‌పై దృష్టి పెట్టి రైల్వేశాఖపై ఒత్తిడి తీసుకురావాలని ఓరుగల్లువాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఊసేలేని రైల్వే డివిజన్

కాజీపేట మీదుగా సెంట్రల్ ఇండియా, నార్త్ ఇండియాకు రైళ్లు నడుస్తున్నాయి. కాజీపేట, వరంగల్ రైల్వేస్టేషన్ మీదుగా ప్రతీరోజు సుమారు 200కు పైగా గూడ్స్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు భూపాలపల్లి, రామగుండం, గోదావరిఖని, మణుగూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో ఉన్న బొగ్గు రవాణా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే జరుగుతుంది. ఎక్కువ ఆదాయం వచ్చే జంక్షన్‌లల్లో కాజీపేట ప్రథమ స్థానంలో నిలుస్తుంది. హైదరాబాద్-సికింద్రాబాద్‌కు 128కిలో మీటర్లకు పైగా ఉన్న కాజీపేటను డివిజన్‌గా చేయటంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు ఉన్నాయి.

నేత కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

మడికొండ, ఆగస్టు 13: కాంగ్రెస్ ప్రభుత్వం నేత కార్మికులకు అండగా ఉండి ఆదుకుంటోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం మడికొండలోని టెక్స్‌టైల్ పార్కులో సిడ్బీ క్లస్టర్ ఇంటర్వెన్షన్ ప్రొగ్రామ్ ఏజీఎం స్మృతివాజ్‌పేయి ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన లాంచ్ వర్క్‌షాప్ కమ్ ఆడాప్షన్ ఆఫ్ గ్రీన్ టెక్నాలజీ సెమినార్‌లో వరంగల్ ఎంపీ కావ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పొట్టచేతపట్టుకొని సూరత్, షోలాపూర్ వంటి ప్రాంతాలకు వలస వెళ్లి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సొంత రాష్ట్రంలో తమ తల రాతలు మారతాయని నమ్మి వచ్చిన నేత కార్మికులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, నేత కార్మికులకు సైతం తగిన న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. తన శక్తి మేరకు నేత కార్మికులకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పార్లమెంట్‌లో మాట్లాడి జిల్లాకు వెల్‌నెస్ సెంటర్ తీసుకువచ్చానని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కడియం కావ్య

వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ పార్కులో యూనిట్లు సక్రమంగా నడుస్తున్నాయని భావించానని, క్షేత్రస్థాయిలో నేత కార్మికుల పరిస్థితి వేరే విధంగా ఉందన్నారు. గత ప్రభుత్వం నేత కార్మికులను నిర్లక్ష్యం చేసిందన్నారు. నేతకార్మికులు తనతో సమావేశమై తమ సమస్యలు పూర్తిగా తెలిపినట్లయితే వారిని మంత్రి కొండా సురేఖ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాకతీయ టెక్స్‌టైల్ అండ్ వీవర్స్ వెల్‌ఫేర్ పొదుపు, పరస్పర సహాయక సహకారం సంఘం అధ్యక్షుడు ఊరుకొండ శ్రీరాములు మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే ప్రారంభించిన టెక్స్‌టైల్ పార్కులో 164 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి ప్రారంభించాయని, వాటికే లోన్లు వచ్చాయని, మిగతా 200యూనిట్లకు లోన్‌లు మంజూరు కాకపోవడంతో ఖాయిలా పడ్డాయన్నారు. వాటికి ప్రభుత్వం సబ్సిడీగానీ, విద్యుత్ సబ్సిడీ గానీ రానందున యూనిట్లు ఉత్పత్తి చేయడంలేదని తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందించే స్కూల్ యూనిఫామ్‌లు, సింగరేణి వంటి సంస్థలకు ఇచ్చే యూనిఫామ్‌లకు చెందిన వస్త్రాలను నేసే పనిని తమకు ఇప్పించినట్లయితే నేత కార్మికులను ఆదుకున్నట్లవుతుందని తెలిపారు. ఈ మేరకు ఎంపీ, ఎమ్మెల్యే చొరవచూపి తమకు తగిన న్యాయం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దర్గా స్వామి, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, కోశాధికారి ఆముదాల జ్యోతిభాస్కర్, డైరెక్టర్లు సదానందం, రాధిక తిరుపతి నేత కార్మికులు, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వస్కుల శంకర్, బిల్ల రవిందర్, వస్కుల నాగరాజు, కుర్ర మోహన్, కొప్పుల నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.

ఇంటర్ ఆర్జేడీ కార్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలి

ఉత్తర్వులు జారీ చేసిన ఇంటర్ విద్య డైరెక్టర్ శృతి ఓఝా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించిన ఇంటర్మీడియెట్ ఆర్జేడీ కార్యాలయాన్ని వెంటనే వరంగల్‌లో తిరిగి ప్రారంభించాలని ఇంటర్మీడియెట్ విద్యాశాఖ డైరెక్టర్ శృతి ఓఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్యాలయ భవనం సమకూరే వరకు ప్రస్తుతానికి హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయాలని ఆమె ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వరంగల్ నుంచి ఆర్జేడీ కార్యాలయం తరలింపునకు ముందు పనిచేసిన ఆర్జేడీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌తో పాటు అందరూ సిబ్బంది తిరిగి ఆర్జేడీ కార్యాలయంలో విధుల్లో చేరాల్సిందిగా ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఆర్జేడీ కార్యాలయం తిరిగి వరంగల్‌లో ఏర్పాటు కానుండటంతో వివిధ అధ్యాపక సంఘాలు, విద్యార్థి సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ బృంద గీతాల పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు ఈనెల 31న జాతీయ బృందగీతాల పోటీలను నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సుధీర్‌కుమార్, కె.సత్యనారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలసముద్రంలోని సామా జగన్మోహన్ స్మారక భవనంలో 6 నుంచి 10 తరగతులు చదివే విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఒక్కో పాఠశాల నుంచి 6 నుంచి 8 మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22లోగా పోటీల కన్వీనర్ కమలమనోహర్ (9440604347)కు వివరాలను పంపించాల్సిందిగా వారు కోరారు.

ఎన్ఐఆర్ఎఫ్‌లో నిట్‌కు 21వ ర్యాంకు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) నిట్‌కు ఇంజనీరింగ్ కేటగిరిలో 21వ ర్యాంకు దక్కింది. సోమవారం సాయంత్రం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో నిట్‌కు ఓవరాల్ కేటగిరిలో 53వ ర్యాంకు సాధించింది. మేనేజ్‌మెంట్ విభాగంలో 100వ ర్యాంకును పొందింది. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులను క్షుణ్ణంగా విశ్లేషిస్తామని, మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రతీ విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 13: ప్రతీ విద్యార్థి దేశభక్తిని పెపొందించుకోవాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయరామరావు కోరారు. డివిజన్ కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం చేబట్టిన హర్ ఘర్ తిరంగా-తిరంగా యాత్ర ర్యాలీలో జీవీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ కలలు కన్నటువంటి స్వచ్ఛభారత్, స్వేచ్ఛభారత్ విశ్వగురువుగా నిలువాలన్నారు. ప్రధాని మోదీ దేశం కోసం అనేక కార్యక్రమాలు చేబడుతూ నేడు ప్రపంచం చూపు భారత దేశం వైపు ఉండేలా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వంతోనే ప్రజలకు సుస్థిరపాలన అందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు నట్ల వెంకటరమణ, గంటె ఉపేందర్‌యాదవ్, కాట్రేవుల రాజు, నాయకులు


తిరంగాయాత్ర ర్యాలీలో పాల్గొన్న విజయరామరావు


నర్మెటలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం నాయకులు

కత్తుల రాజు, రడపాక ప్రదీప్, కొలనుపాక శరత్, పుంద్రు నవీన్ రెడ్డి, దూసరి విజయ్‌కుమార్, మంద రాజేష్ రెడ్డి, మారబోయిన రాజేష్, చందర్, అశోక్, శివకృష్ణ, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

- జఫర్‌గడ్ : జఫర్‌గడ్ మండల కేంద్రంలో మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ చేపట్టారు. బీజేపీ చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం బీజేపీ, అనుబంధ బీజేవైఎం నాయకులతో పాటు పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలను చేబూని మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ప్రదర్శన నిర్వహించారు. భారత్ మాతాకీ జై.. అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పు ల నాగేశ్ గౌడ్ మాట్లాడుతూ పంద్రాగస్టు పురస్కరించుకుని 15న ఇంటింటి జాతీయ జెండాలను ఎగురవేయాలని కోరారు. స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకోవాలన్నారు. బీజేపీ, బీజేవైఎం నాయకులు ఎ.మదన్‌మోహన్, కాడబోయిన యువరాజు, రవీంద రరెడ్డి, సింగారపు రమేశ్, పి.యాదగిరి, గణేష్, పి.రాజు, గోదారి సాయిరాం, మారెపల్లి రవి, లింగన్న, పాల్గొన్నారు.

నర్మెటలో తిరంగా ర్యాలీ

నర్మెట, ఆగస్టు 13 : నర్మెట మండలకేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో బీజేవైఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నర్మెట ఉన్నత పాఠశాల నుంచి చౌరస్తా వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ర్యాలీలో బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు పాల్గొని మాట్లాడారు. బీజేపీ జిల్లా కోశాధికారి సొక్కం అనిల్‌కుమార్, అంజనేయులు, రాజు, సిద్దులు, కొమురెల్లి, యాదగిరి, మోహన్‌భాషా పాల్గొన్నారు.

ఆలయ శంకుస్థాపనకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యే కడియంకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 13: మండలంలోని సముద్రాల గ్రామంలో నూతనంగా నెలకొల్పనున్న శ్రీ మహంకాళీ దేవాలయం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన నాయకులు మంగళవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని, ఎంపీ కడియం కావ్యను కోరారు. హనుమకొండలోని వారి నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. నాయకుల ఆహ్వానం మేరకు నేడు (బుధవారం) గ్రామంలో జరిగే కార్యక్రమాన్ని కడియం హాజరుకానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ కుందూరు నాగమణి-సోమిరెడ్డి దంపతులు వారి స్వంత ఖర్చులతో ఆలయాన్ని గ్రామంలో నిర్మిస్తున్నారని తెలిపారు. ఆలయ శంకుస్థాపన కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇనుగాల వెంకటేశ్వరరెడ్డి, తాటికొండ కుమారస్వామి, గుండె నర్సయ్య పడిశాల వెంకటేష్, ఓరుగంటి వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీనివాస్, వీరగోని సత్యనారాయణ, వీరగోని రాజు, నారాయణ, చీమల కుమారస్వామి, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కిందకు దూసుకెళ్లిన కారు

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 13: మండలంలోని రాఘవాపూర్ గ్రామం వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు కిందకు కారు దూసుకెళ్లిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హనుమకొండ నుంచి జనగామ వైపు వెళుతున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు రాఘవపూర్ గ్రామ బస్టాండ్ వద్ద ప్రయాణికులను దింపేందుకు ఆగింది. అదే సమయంలో హనుమకొండ నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు అదుపుతప్పి బస్సు కిందకు దూసుకెళ్లింది. కారులో బెలూన్లు తెరుచుకోవడం ప్రయాణిస్తున్న ముగ్గురికి ఎలాంటి గాయాలు కాలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

క్షేత్ర పర్యటనలతో విషయ పరిజ్ఞానం

నర్మెట, ఆగస్టు 13 : క్షేత్ర పర్యటనలతో విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు మెరుగు పడుతాయని ఒకేషనల్ టీచర్ అనిల్‌రెడ్డి అన్నారు. నర్మెట మోడల్ స్కూల్ విద్యార్థులు ఒకేషనల్ ఎడ్యుకేషన్ అగ్రికల్చర్ కోర్స్ లో భాగంగా మంగళవారం ముల్కనూరు డైరీ క్షేత్ర పర్యటనకు వెళ్లారు.ఈ సందర్భంగా విద్యార్థులు డైరీ ఫార్మ్ నిర్వహణ, సహకార సంఘ వివరాలు, యాజమాన్య పద్ధతులు, స్వయం ఉపాధి కల్పన సామర్థ్యాలు, సహకార సంఘాలు రైతులు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో వివరంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిబాబా, మౌనిక, ముల్కనూరు డైరీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

కొడకండ్ల ఆగస్టు 13 : మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం డీఏవో వినోద్‌కుమార్, ఏవో విజయ్ రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ అన్ని ఫర్టిలైజర్ దుకాణాల్లో రికార్డులను, నిల్వలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు రైతులకు సరిపోయేంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈపాస్ మెషిన్‌ల ద్వారానే అమ్మకాలను జరపాలని దుకాణ యజమానులను ఆయన ఆదేశించారు.

వర్గీకరణ సాధనలో కృష్ణమాదిగ పాత్ర చరిత్రాత్మకం



శ్రేణులతో కలిసి వెళ్తున్న కార్యదర్శి ఇల్లందుల సుదర్శన్

చిలుపూర్, ఆగస్టు 13 : ఎస్సీ వర్గీకరణ సాధనలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పాత్ర చరిత్రాత్మకమని అంబేద్కర్ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఇల్లందుల సుదర్శన్ అన్నారు. వర్గీకరణ ప్రకటన అనంతరం తొలిసారిగా హైదరాబాద్ నగరానికి విచ్చేస్తున్న కృష్ణమాదిగకు ఘనస్వాగతం పలికేందుకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి మంగళవారం పెద్దసంఖ్యలో ఎమ్మార్పీఎస్ శ్రేణులను తరలించారు. కార్యక్రమంలో చిన్నపెండ్యాల మాజీ సర్పంచ్ ఇల్లందుల రాజేందర్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు అరూరి శ్రీనివాస్, నలిమెల నాగరాజు పాల్గొన్నారు.

- రఘునాథపల్లి : సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో వర్గీకరణ కోసం మూడు దశాబ్దాల పాటు అలుపెరుగని ఉద్యమాలు చేపట్టిన ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఢిల్లీ పర్యటనను విజయవంతం చేసుకొని మంగళవారం హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు మండలంలోని ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు బైరపాక జయకర్, కొయ్యడ మల్లేష్, తాళ్లపల్లి వెంకటస్వామి, దర్శనాల రవి, బంద రవీందర్, బొల్లపల్లి కుమారస్వామి, చంద్రయ్య, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.
- బచ్చన్నపేట : ఎస్సీ వర్గీకరణపై సానుకూల నిర్ణయం వెలుబడేందుకు కృషి చేసి, ఢిల్లీ నుండి హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవ ర్యాలీకి మండలం నుండి పెద్ద సంఖ్యలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు అల్వాల నర్సింగరావు, అల్వాల రాజు, పాకాల కుమారస్వామి, నల్ల అంజయ్య, బందారం చిరంజీవి, వెంకటేశ్, రవి, శ్రీకాంత్, ఇస్తారి, నరేష్, అజయ్ తదితరులున్నారు.

నీర్మాలలో జీపీ అనుమతులు లేకుండా వెలసిన వెంచర్

దేవరుప్పుల, ఆగస్టు 13: మండలం లోని నీర్మాల గ్రామంలో తక్కువ ధరలకు రైతుల వద్ద కొంత మంది రియల్టర్లు సర్వే నెంబర్లు 3, 6, 8, 22, 23, 24, 30, 31, 32, 44లో 16 ఎకరాలు వ్యవసాయభూమి కొనుగోలు చేసి లేఔట్ లేకుండా వెంచర్ చేసి ప్లాట్లు విక్రయిస్తుండగా గ్రామస్థులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. చట్ట పరంగా జీపీకి రావాల్సిన ఆదాయం గండి కొట్టడంతో పాటు జీపీకి పార్క్, స్కూల్, నీటి ట్యాంక్ తదితర అభివృద్ధికోసం ఎకరాకు 4 గుంటలు అప్పగించాల్సిన భూమిని ఎగనాం పెట్టారు. ఇట్టి భూమిలోని 30, 31, 32 సర్వే నంబర్లలోని 3ఎకరాల భూమిని స్థానిక తహసీల్దార్ నాలా చేశారు. దాన్ని గుంటల వారీగా చేయడంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం గండిపడింది. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా స్పందించి అట్టి వెంచర్‌ను పరిశీలించాల్సిందిగా తహసీల్దార్ హుస్సేన్‌ను ఆదేశించారు. మంగళవారం వెంచర్‌ను పరిశీలించిన ఆయన రెవెన్యూ, మండల పరిషత్ అధికారులను తోడు తీసుకెళ్లి వెంటనే ఎక్స్‌కవేటర్ సహాయంతో అక్రమ కట్టడాలను కూల్చివేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్, ఎంపీఓ సురేష్‌కుమార్, ఆర్ఐలు రాజు, ఆంధ్రయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకేరు వాగుపై చెక్‌డ్యాంలను నిర్మించాలి

జఫర్‌గడ్, ఆగస్టు 13 : మండలంలోని తిడుగు, కోనాయిచలం ఆకేరు వాగులపై చెక్‌డ్యాంలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, రైతులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు. మంగళవారం వారు హన్మకొండలో కడియంను కలిసి ఆకేరు వాగుల్లో చెక్‌డ్యాంల నిర్మాణం వల్ల వర్షపు, వరద నీరు నిలిచి భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. స్పందించిన కడియం శ్రీహరి ఫోన్‌లో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి చెక్‌డ్యాంల నిర్మాణానికి గాను క్షేత్ర స్థాయిలో సర్వే జరిపి నిధులను అంచనా వేయాలని ఆదేశించారని నాయకులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు సంపత్‌రెడ్డి, శ్రీరాముల నవీన్, గోపరాజుల సంపత్, రాగి ఎల్లారెడ్డి, మాధవరెడ్డి, కృష్ణారెడ్డి, రడపాక ఇంద్రయ్య, కరుణాకర్, ప్రణయ్, యాదయ్య, ఎల్లయ్య యాదగిరి, సత్యనారాయణ, మల్లారెడ్డి పాల్గొన్నారు.

శభాష్ పోలీస్...

ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు


తూడి సతీష్‌కు కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసులు

రఘునాథపల్లి, ఆగస్టు 13: ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించిన ఆటో డ్రైవర్‌ను పోలీసులు కాపాడిన సంఘటన మండలంలోని నిడిగొండ గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తూడి సతీష్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబ తగాదాల విషయంలో భార్యతో గొడవపడిన సతీష్ క్షణికావేశంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంటానని వెళ్లాడు. కుటుంబసభ్యులు డయల్-100కు ఫోన్ చేయగా, వెంటనే పోలీస్ పెట్రోలింగ్ వాహనం సిబ్బంది స్పందించి రైలు పట్టాల వద్దకు వెళ్తున్న సతీష్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా తక్షణమే స్పందించి వ్యక్తితో పాటు కుటుంబం జీవితాన్ని రక్షించారని, సతీష్‌ను కాపాడిన పోలీస్ సిబ్బంది సురేష్, యుగంధర్‌ను సీఐ ఎడవెల్లి శ్రీనివాస రెడ్డి, నిడిగొండ గ్రామస్థులు అభినందించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


మల్లేష్ (ఫైల్)

రఘునాథపల్లి, ఆగస్టు 13: పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన దొరగొల్ల మల్లేష్(24) వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దొరగొల్ల మల్లేష్ ఈ నెల 10న మద్యం తాగి ఇంటికి రావడంతో అతని భార్య అనూష మధ్యాహ్నం పూట మద్యం ఎందుకు తాగి వచ్చావని ఆడగడంతో క్షణికావేశానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. పురుగుల మందు తాగిన మల్లేష్‌ను చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మల్లేష్ నానమ్మ అయిలమ్మ తాజా మాజీ సర్పంచ్. మల్లేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి దొరగొల్ల యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


సదానందం (ఫైల్)

జఫర్‌గడ్, ఆగస్టు 13 : మండలంలోని కూనూరులో కొలిపాక సదానందం(42) అనే వ్యక్తి అనారోగ్య సమస్యలతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన ప్రకారం సదానందం మంగళి వృత్తి పనితో పాటు ఉన్న వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. అయితే కొద్ది కాలంగా అతడు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సదానందం సోమవారం రాత్రి గ్రామ చివర గల తన పశువుల కొట్టంలో ఉరి వేసుకుని చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బానోత్ రామ్‌చరణ్ నాయక్ తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

చిలుపూర్, ఆగస్టు 13 : మండలంలోని వెంకటాద్రిపేటలో బెల్టు షాపులపై పోలీసులు దాడులు చేపట్టారు. మంగళవారం ఎస్సై నవీన్‌కుమార్ నేతృత్వంలో మద్యం దుకాణాలపై కొరడా ఝులిపించారు. గ్రామానికి చెందిన తాడగోని నరేందర్ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన రూ.5వేల విలువ గల మద్యం స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో బోనాల పండుగ

కొడకండ్ల ఆగస్టు 13 : మండలకేంద్రంలో మంగళవారం బోనాల పండుగను పార్టీలకతీతంగా ఘనంగా నిర్వహించారు. గంగపుత్రుల ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం బోనాల పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. ఉదయం మహిళలు ఇంటినుంచి బోనం ఎత్తుకుని ఆలయానికి చేరుకుని ముత్యాలమ్మకు, కాలభైరవునికి ప్రదక్షిణ చేసి బోనం సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పేరం రాము, శారద, ఎం.సోమన్న, నీలిమ, కోల కుమార్, వలబోజు ఉపేందర్, రామ్మూర్తి, జ్ఞానేశ్వరాచారి, అనిల్, మహేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు దాతల విరాళాలు

బచ్చన్నపేట, ఆగస్టు 13 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించేందుకు ఇటీవల దాతలు ముందుకు వస్తున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల గదులకు రూ. 20 వేలు వెచ్చించి దొంతుల చంద్రమౌళి, పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన మున్నా కలిసి రంగులు వేయించారు. అలాగే సాల్వాపూర్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన చీర్ల మల్లేశం రూ. 10 వేల విలువ చేసి మైక్‌సెట్‌ను అందించారు. శ్రీహరిచారి, బత్తిని వెంకటేశ్, నిమ్మల రాజు పాల్గొన్నారు.

పద్మశాలీలు ఎన్నికల్లో భాగస్వామ్యం కావాలి

- 18న సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక
- రాష్ట్ర వ్యాప్తంగా 99, జిల్లాలో 8 పోలింగ్ కేంద్రాలు
- పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు బాలరాజు


జఫర్‌గడ్‌లో వాల్ పోస్టర్ల ఆవిష్కరణలో పద్మశాలి సంఘం బాధ్యులు

జఫర్‌గడ్, ఆగస్టు 13 : తొలిసారిగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించబోతున్న పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికల్లో పద్మశాలీలంతా భాగస్వాములు కావాలని ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వేముల బాలరాజు కోరారు. ఎన్నికల వాల్, డోర్ పోస్టర్ల ఆవిష్కరణ మంగళవారం జఫర్‌గడ్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బాలరాజు మాట్లాడుతూ ఈనెల 18న రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక నిర్వహిస్తున్నామన్నారు. బ్యాలట్ పద్ధతిలో ఓటు వేసే విధానంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 99 కేంద్రాలు, జనగామ జిల్లాలో జనగామ, పాలకుర్తి, జఫర్‌గడ్, తదితర ప్రాంతాల్లో 8 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో మొత్తం 48,381 మంది, జిల్లాలో 3 వేల మంది పద్మశాలీలు ఓటర్లుగా నమోదు చేసుకున్నారన్నారు. వీరంతో బాధ్యతగా ఈనెల 18వ తేదీ ఆదివారం ఆయా కేంద్రాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి వల్లకాటి రాజ్‌కుమార్, బూర మల్లేశం అనే ఇద్దరు పోటీలో ఉన్నారన్నారు. సమావేశంలో పద్మశాలి సంఘం జిల్లా ప్రతినిధులు దోర్నాల వెంకటేశ్వర్లు, గుమ్మడవెల్లి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు మామిడాల సోమనారాయణ, టౌన్ అధ్యక్షుడు బైరి వెంకటేశ్వర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

- చిలుపూర్ : పద్మశాలీలు ఐక్యంగా ఉద్యమించి వారి సమస్యలను పరిష్కరించుకోవాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల బాలరాజు అన్నారు. ఈ నెల 18న జరుగనున్న సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న వల్లకాటి రాజ్‌కుమార్‌కు మద్దతుగా చిన్నపెండ్యాలలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. చేనేత ఐక్యవేదిక నియోజకవర్గ ఇన్‌చార్జి, పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు గజ్జెల దామోదర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు బత్తుల సూర్యనారాయణ, డాక్టర్ పేరాల సుధాకర్, బండారి రాజ్‌కుమార్, పేరాల నాగభూషణ్, వేముల వెంకటేశ్వర్లు, కనుకుంట్ల యాదగిరి, వెంకటేశ్వర్లు, సామల రాములు, తౌటి శ్రీధర్, కుసుమ రవి తదితరులు పాల్గొన్నారు.
- రఘునాథపల్లి : చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం అంకిత భావంతో కృషి చేయాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల బాలరాజు అన్నారు. ఈ నెల 18న జరిగే పద్మశాలీ సంఘం రాష్ట్ర ఎన్నికలను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్‌పోస్టర్లను పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల బాలరాజు తదితర నాయకులు మండల కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా ప్రచారకార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి, సంఘం మండల అధ్యక్షుడు కర్మికొండ వెంకటేశ్వర్లు, దోర్నాల వెంకటేష్, గుండ కృష్ణమూర్తి, మచ్చ బాలనర్సు సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతల పండుగలను ఘనంగా నిర్వహించాలి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 13: శ్రావణమాసంలో నిర్వహించే వివిధ గ్రామ దేవతల పండుగలను ఘనంగా నిర్వహించేలా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, రైతు బంధు సమితి మండల కో ఆర్డినేటర్ చింతకుంట్ల నరేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని జీపీ కార్యాలయంలో అఖిల పక్షాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు ఈ నెల 14న విశ్వబ్రాహ్మణులు పోచమ్మ బోనాలను నిర్వహించాలని, 18న మిగితా కులాలకు చెందిన వారు పోచమ్మ బోనాలు నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో సత్యనారాయణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంబటి కిషన్‌రాజ్, గట్టు చేరాలు, బంగ్లా శ్రీనివాస్, గట్టు రమేష్, గోనెల ఉపేందర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లిన వ్యక్తి అరెస్ట్

దేవరుప్పుల, ఆగస్టు 13: మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లిన వ్యక్తిని దేవరుప్పుల పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దేవరుప్పుల ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా రాయచోటికి చెందిన కొర్లకంట నరేష్ తీసుకెళ్లగా అతడిపై ఈనెల 5న పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఆయన వెల్లడించారు. నిందితుడు మంగళవారం గొల్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద కనిపించగా నరేష్‌ను అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

లింగాలఘణపురం, ఆగస్టు13: భారతీయ తపాలా శాఖ సేవలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జనగామ ఈస్ట్ సబ్‌డివిజనల్ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ రవి అన్నారు. మంగళవారం లింగాలఘణపురం మండలం నేలపోగులలో స్థానిక బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ తేజస్విని అధ్యక్షతన జరిగిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు రవి ముఖ్యఅతిథిగా హాజరై పోస్టల్ బ్యాంకు అందించే పలురకాల స్కీంలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, మెయిల్ ఓవర్సీస్ చీమలపాటి భాస్కర్, నవాబుపేట సబ్‌పోస్టాఫీస్ పరిధి బీపీఎంలు మనోహర్, అసిస్టెంట్ బ్రాంచ్‌పోస్ట్ మాస్టర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

చిలుపూర్, ఆగస్టు 13 : ప్రతీఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల బారి నుంచి తమను తాము రక్షించుకోవాలని జనగామ రూరల్ (రఘునాథపల్లి) సీఐ ఎడవెళ్ళి శ్రీనివారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చేరుకున్న ఆయన స్థానిక రాజకీయ పార్టీల ప్రతినిధులు, వాకర్స్‌తో కలిసి ఎన్‌హెచ్ 163పై జరుగుతున్న ప్రమాదాల స్థలాలను, యూటర్న్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో చిలుపూర్ ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్, మాజీ సర్పంచులు తాళ్ళపల్లి సమ్మయ్య, మామిడాల లింగారెడ్డి, జనగామ యాదగిరి, గజ్జెల దామోదర్, మామిడాల యాదవరెడ్డి, ఇల్లందుల యాదగిరి, గడ్డమీది వెంకటస్వామి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

జనగామ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న క్రమంలో ప్రయాణికుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను జనగామ రైల్వే పోలీసులు మంగళవారం తిరిగి అప్పగించారు. వివరాల్లోకెళితే.. మహారాష్ట్ర రాష్ట్రం వార్ధాకు చెందిన మారుప్ ఈనెల 11న అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు దక్షిణ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. రైలు జనగామ రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే స్టేషన్ ప్లాట్‌ఫారంపై సెల్ జారి కింద పడిపోయింది. 12న ఉదయం డ్యూటీలో ఉన్న జీఆర్‌పీ సిబ్బంది సెల్‌ఫోన్‌ను గుర్తించి వివరాలు కనుక్కున్నారు. కాగా.. మంగళవారం బాధిత ప్రయాణికుడికి పోగొట్టుకున్న రూ.90 వేల విలువైన ఐఫోన్‌ను జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ సుదర్శన్ అప్పగించారు.

విచారణ చేపట్టిన అధికారులు

పాలకుర్తి, ఆగస్టు 13 : మండల కేంద్రంలోని ఓ గురుకుల పాఠశాలలో బాలిక వంట మనిషి లైంగిక వేధింపుల సంఘటనపై మంగళవారం మండల ప్రత్యేక అధికారి (డీఆర్‌డీవో పీడీ) వసంత, పాలకుర్తి ప్రత్యేక అధికారి, జిల్లా శిశు సంక్షేమ అధికారి జయంతి, జీసీడీవో గౌసియా బేగం సందర్శించి విచారణ చేపట్టారు. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ స్వరూపను అదే విధంగా బాలికను కూడా జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు ? బోధనేతర సిబ్బంది కదలికలపై కూడా ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని వారి వ్యవహార శైలిని గమనించాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, నివేదికను జిల్లా కలెక్టర్‌ను అందజేస్తామని చెప్పారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ

జనగామ, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడారం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు వనిత క్లబ్, వాసవి క్లబ్, ఎన్ఆర్ఐలు దుడుక కరుణ శ్యాం, శైలజా దివాకర్, రజినీ ఆశిష్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రూ. 60వేల విలువైన క్రీడాదుస్తులు, ఆటవస్తువులు, భోజనం ప్లేట్లు, గ్లాసులను అందజేశారు. ఈ సందర్భంగా వనిత క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ వరూధిని మాట్లాడారు. గంగిశెట్టి అనూజ, పడకంటి రవీందర్, ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

వీధిలైట్ల నిర్వహణను వెంటనే చేపట్టాలి

లింగాలఘణపురం, ఆగస్టు 13: లింగాలఘణపురం మండల వ్యాప్తంగా వీధిలైట్ల నిర్వహణలేకపోవడంతో గ్రామాలన్నీ అంధకారంలో ఉంటున్నాయని వెంటనే వీధిలైట్లను ఏర్పాటు చేసి వాటిని నిర్వహించాలని మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ఎంపీడీవో జలంధర్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు గుడి వంశీధర్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

నీళ్లు దోచుకుపోతున్నా సోయి లేదు

- సీఎంపై మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ధ్వజం


మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య

జనగామ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలను ఏపీ ముఖ్యమంత్రి దోచుకుపోతున్నా సీఎం రేవంత్‌రెడ్డికి ఏమాత్రం సోయి లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య ఫైర్ అయ్యారు. జనగామ జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాదుల వద్ద నీళ్లు ఉన్నప్పటికీ ఎందుకు విడుదల చేయడం లేదని విమర్శించారు. జనగామ జిల్లాలోని రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటిపోతున్నాయని అన్నారు. మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోతే కాంగ్రెస్ ప్రభుత్వం నానా హంగామా చేసిందని విమర్శించారు. వ్యవస్థలో లోపాలు ఏర్పడితే సరిదిద్దాల్సింది పోయి రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు. కాళేశ్వరం పేరు మీద రూ. లక్షల కోట్లు తిన్నారని ఆరోపణలు చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు కాళేశ్వరంలో అవినీతి జరిగితే కమీషన్ ముందు ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఆధారాలు లేకపోవడం వల్లే ఆరోపణలు చేస్తున్నారన్నారు. కాళేశ్వరం విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు పన్నుతోందన్నారు. సమగ్ర కుటుంబ సర్వే చేయించిన ఘనత కేసీఆర్‌ది అని అన్నారు. కులగణన చేస్తా అంటూ రేవంత్‌రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గోదావరి జలాలతో జిల్లాలోని రిజర్వాయర్లను నింపాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం తిమ్మిని బమ్మి చేస్తూ కాలం గడుపుతోందని మండిపడ్డారు. సమావేశంలో మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ గాడిపల్లి ప్రేమలతారెడ్డి పాల్గొన్నారు.